# తోక చుక్క

## పురాణపండ రంగనాథ్

శరత్కాలం. అక్టోబరు నెల మామూలుగానే గడిచింది. నవంబరు మొదటివారం కూడా పెద్దగా చలివేయ లేదు. కాని రెండవ వారం నుంచి చలి ఉధృతం కాసాగింది.

వయసులో వున్నవాళ్ళకి చలిరాత్రులు వేడి రాత్రులే కాని వయసుమళ్ళిన వాళ్ళకి అవి యెప్పటికీతెల్లవారని విసుగురాత్రులు.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు కాని త్వరగానే మెలకువ వచ్చేసింది వసంతకి. అందుకు కారణం లేక పోలేదు. కిటికీలోంచి రివ్వున వీచిన చలిగాలికి ఆమెనిద్ర చెదిరిపోయింది. కళ్ళు తెరిచి చూసింది. గదిలో నీలి రంగు బల్బు గుడ్డిగా వెలుగుతోంది. కిటికీలోంచి బయటకు చూసింది. ఆకాశం అంచు నుంచి దట్టమైన కాటుక పొరలా చీకటి వేలాడుతోంది. శరత్కాలపు వెన్నెల రాత్రి యెంత అందమైనదో, చీకటి రాత్రి అంత భయంకరమైనది.

ఆమె 'బెడ్'మీద పక్కకు చూసింది. అక్కడ భర్త లేదు. ఆయన మామూలుగా కప్పుకొనే ఉన్ని శాలువా మాత్రం పక్కమీదే వుంది. ఆమె దృష్టి హేంగర్స్ వైపు మళ్ళింది. అక్కడ ఆయన చలికోటు లేదు.

ఆ రాత్రివేళ భర్త ఒంటరిగా యెక్కడకు వెళతాడో ఆమె వూహించగలదు. "దివ్య"ని తీసుకొని మేడ పై అంతస్థుమీదకు వెళ్ళి ఆకాశాన్ని ఆత్రంగా చూస్తుంటాడు. ఈ వయస్సులో ఆయనకీపిచ్చి బాగా ముదిరి పోయింది.

వసంత వూలు శాలువాని తలమీద నుంచి ఒంటి నిండా కప్పుకొని మేడమీదకు వెళ్ళింది. ఆమె వూహించి నట్లుగానే భర్త "దివ్య" కళ్ళల్లోకళ్ళుపెట్టి చూస్తున్నాడు. తన అడుగుల ధ్వని విని తల తిప్పి ఆశ్చర్యంగా చూశాడు.

"రా! నువ్వూ చూడు" అని ఆ టెలిస్కోప్ దగ్గర నుంచి తప్పుకొన్నాడు. వసంత మందహాసం చేస్తూ వచ్చి టెలిస్కోప్ దగ్గర నిలబడిపోయింది.

"ఏం వుంది? రోజూచూసే తారామణులేగా" అంటూ వసంత టెలిస్కోప్‌ను అసహనంగా చూసింది. ఆమెకు యీ ఆకాశ వీక్షణం అంతగా నచ్చదు. కాని ఆమె భర్త విద్యాసాగర్‌కి అదే ధ్యాస.

"వసంతా! పాత రాగాల ఆలాపనలో నుంచే సంగీత కారుడు ఆనందం పొందుతాడు. హఠాత్తుగా కొత్త రాగాన్ని సృష్టిస్తాడు. వర్ణ సమామ్నాయంలోని పాత అక్షరాల నుంచే కవి భవ్యభావోన్నత కవితా సౌధాలు నిర్మిస్తాడు. అలాగే యీ ఆకాశ వీక్షణం!" విద్యాసాగర్ ఆమెకు తన ప్రవృత్తి రహస్యాన్ని అవగతం చేయాలని యిలా చెప్పడం ఇవాళే కొత్తకాదు.

విద్యాసాగర్ ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసి రిటైరైనాడు. అతనికి ఖగోళ విజ్ఞానం అభిమాన విషయం. ఉద్యోగ కాలంలో ఆకాశ పరిశీలన సరదా అంతగా తీరలేదు. ఇప్పుడంతా అదే ధ్యాస. ఈ మధ్యనే ఒక టెలిస్కోప్ సంపాదించాడు. దానికి "దివ్య" అని పేరు పెట్టాడు.


ఆ టెలిస్కోప్ ఎపర్చర్ కొలత ఎనిమిది, ఫోకల్ లెంగ్త్ అరవైనాలుగు అంగుళాలు. ఖగోళ విజ్ఞాన పరిభాష లో యీ కొలతల్ని 'వైటల్ స్టాటిస్టిక్స్' అంటారు.

ప్రతిరోజూ రాత్రి నియమిత కాలాల్లోఆ టెలిస్కోప్ ద్వారా తారామండలాన్ని పరిశీలించడం 'హాబీ'గా పెట్టుకొన్నాడు విద్యాసాగర్.

ఔత్సాహిక ఖగోళ పరిశోధకులకు వలెనే అతనికీ ఒక కోరిక వుంది. ఎప్పటికయినా ఒక కొత్త తోక చుక్కని కనిపెట్టాలని, దానికి తన పేరు పెట్టాలని విద్యాసాగర్ ఆశ. అందుకే నిద్ర పట్టని రాత్రుల్ని అంతరిక్ష వీక్షణంలో గడపడం అలవాటు చేసుకొన్నాడు.

ఆ మాటే భార్య వసంతతో అంటుంటాడు. ఆమె పరిహాసంగా తోసి పారవేస్తుంటుంది అతని మాటల్ని.

తోకచుక్కలు సౌర కుటుంబానికి చెందినవే. అయితే అవి గ్రహాలవంటివి కావు. వాటి కక్ష్యలు వేరు. అవి 'వూర్ట్' మేఘ మండలంలో జన్మిస్తాయి. సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. కొన్ని తోకచుక్కలు దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతాయి. అవి స్వల్ప కాలంలో మనకు కనిపిస్తుంటాయి. కొన్ని తోకచుక్కలు పారా బోలా (సాగదీసిన దీర్ఘ వృత్తాకారం) కక్ష్యలో తిరుగుతుంటాయి. ఇవి వంద యేళ్ళలోపున భూమికి దర్శన




ఆంగ్లమూలం: జయంత్ విష్ణునార్లీకర్

### ఈ కథకు నేపథ్యం

'హేలీ' తోకచుక్క వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని బొంబాయికి చెందిన ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ విష్ణునార్లీకర్ తోకచుక్కలపై మూఢనమ్మకాలని విమర్శిస్తూ 'కామెట్' అనే కథ వ్రాశారు. అది ఆధారంగానే భారతీయ బాలల చలనచిత్ర సమితి ప్రప్రథమంగా 'ధూమకేతు' అనే పేరుతో సైన్స్ చిత్రం నిర్మించి బెంగుళూరు బాలల చలన చిత్రోత్సవంలో ప్రదర్శించింది. ఆ కథకు యిది అనుసరణ. ఆంధ్రానుసరణానికి అంగీకరించిన శ్రీ నార్లీకర్‌కు కృతజ్ఞతలు.

—అనువాదకుడు



మిస్తుంటాయి. మరికొన్ని తోకచుక్కలు హైపర్ బోలా (మరీ సాగదీసిన దీర్ఘ వృత్తాకార) కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి. ఇవి వేల యేళ్ళ వరకు మరల కనిపించవు. 1985-86 లో దర్శనం ఇస్తున్న హేలీ పారాబోలా కక్ష్యలో తిరిగే తోకచుక్క. ఇది ప్రతి 75-80 సంవత్సరాల వ్యవధిలో భూమికి కనిపిస్తుంది. తోకచుక్కల్ని కనిపెట్టినవారి పేరున పిలవడం పరిపాటి.

ఇలాంటి వివరాలన్నీ చెప్పి వసంత మనస్సును తన పరిశీలనలకు అనుకూలం చేసుకోవాలని విద్యాసాగర్ వృథా ప్రయాస పడుతుండేవాడు.

"ఇంతకన్నా 'అల్ట్రా మోడరన్' టెలిస్కోప్‌లతో పెద్ద పెద్ద అబ్జర్వేటరీల నుంచి పరిశీలనలు జరుపుతుంటారు. మీకోసం ఎవ్వరూ తోకచుక్కని గుర్తించకుండావిడిచిపెట్టరు" వసంత విద్యాసాగర్ సంపాదించిన టెలిస్కోప్‌మీద అక్కసుతో అనేది.

"నిజమే! కాని పెద్ద టెలిస్కోపులతో చూసేవారు ఒక్కొక్కసారి చిన్న వస్తువుల్ని చూడరు. లేదా వారు గుర్తించకపోవచ్చు. అందుకే నా పరిశీలన ఫలించకపోదు' ఇది విద్యాసాగర్ ఆత్మవిశ్వాసంతో అనే మాట.

** ** **

అతని ఆత్మవిశ్వాసం వృధా పోలేదు. అతని పరిశోధన వమ్ము కాలేదు. ఒకనాటి రాత్రి పాత నక్షత్రాల నేపథ్యంలో మసకమసకగా అతనికి ఒక కొత్త వస్తువు కనిపించింది. అతను పదేపదే ఆ వస్తువును చూశాడు. పాత రికార్డుల్ని పరిశీలించాడు. టెలిస్కోప్‌ని సరిగా సవరించుకొని ఆ వస్తువుని ఒకటికి రెండుసార్లు నిశితంగా చూశాడు.

సందేహం లేదు. అది కొత్త తోకచుక్క. పాకెట్ కాలిక్యులేటర్‌తో లెక్కలు వేశాడు.

ఆకాశంలో ఆ ప్రదేశంలో యిదివరకు యేమీ లేదు. ఇప్పుడు ప్రత్యక్షం అయింది. తన అంచనా తప్పు కాదు. తన పరిశీలనలో లోపం లేదు. అది కొత్త తోకచుక్కే. సందేహం లేదు. మరో రెండుమూడు రోజులు అతను పరిశీలనకొనసాగించాడు. అదినవధూమకేతువు' అని ధ్రువపరచుకొన్నాడు.

కవలూరులోని భారతీయ ఖగోళ భౌతిక విజ్ఞాన శాస్త్ర సంస్థకు తన పరిశీలన గురించి తెలిపాడు. ఆ సంస్థలో ఆసియాలోనే పెద్దదైన '90 ఇంచెస్' టెలి

స్కోప్ వుంది. ఆ సంస్థ విద్యాసాగర్ పరిశీలనని ధృవ పరిస్తే అతని పేరున ఆ తోకచుక్క పిలువబడుతుంది.

కవలూారు సంస్థ కూడా కొత్త తోకచుక్క ఉనికిని రికార్డు చేసి, విద్యాసాగర్ పరిశీలనకు సర్టిఫికెట్ ఇచ్చింది.

నాటినుంచి విద్యాసాగర్ పేరుదేశ, విదేశీపత్రికలలో ప్రముఖంగా వచ్చింది. హైదరాబాద్ నివాసి అయిన విద్యాసాగర్ కొత్త తోకచుక్క కనిపెట్టాడని, అందుచేత దానిని ''కామెట్ విద్యాసాగర్'' అని పిలుస్తున్నారని పత్రికలు అతని ఫోటోతో సహా ప్రచురించాయి.

** ** **

విద్యాసాగర్‌కి బోలెడు పబ్లిసిటి వచ్చింది. మీటింగ్‌లకీ, సన్మానాలకీ మితిలేకుండా పోయింది. ఇలాంటి ప్రచారాలంటే విద్యాసాగర్‌కి స్వభావతః యిష్టం వుండదు. కానీ తప్పని పరిస్థితి. కొత్త ''తోకచుక్కని కనిపెట్టకపోయినా బాగుండేది'' అనిపించేది అప్పుడప్పుడు.

వసంత కూడా ఆ మాటే అంది. అయితే ఆమె చెప్పే కారణం మాత్రం వేరు.

''తోకచుక్క ప్రపంచానికి అరిష్టదాయకం. మీరు దాన్ని కనిపెట్టారు. నాకేదో భయంగా వుంది'' వసంత యీమాటలన్నప్పుడు విద్యాసాగర్ నవ్వేశాడు.

''ఎం.ఎ. చదివావు. బోలెడు సంగతులు తెలుసు. అయినా తోకచుక్కలమీద మూఢ నమ్మకం పోలేదన్న మాట'' అనేవాడు విద్యాసాగర్.

తోకచుక్కలు రోదసిలో తిరిగే మంచు బంతులు. అవి తమ కక్ష్యలలో సూర్యుడి చుట్టూ తిరుగుతుంటాయి. అవి భూగోళానికి హాని కలిగించవు. ఉన్నపళంగా ప్రళయాన్ని సృష్టించవు. ఇది విజ్ఞాన శాస్త్రవేత్తలు చెప్తున్న మాట. అయినా మనిషికి తోకచుక్క భయం పోవడంలేదు. వసంత యిందుకు మినహాయింపు కానే కాదు. విజ్ఞానం కన్న విశ్వాసం బలమైనది.

విద్యాసాగర్ తోకచుక్కని కనిపెట్టిన నాటినుంచి వసంత యింటిలో శాంతి, జపాలు మొదలుపెట్టించింది. ఆతనికి ఆ తంతులు యిష్టం లేకపోయినా భార్య యిష్టానికి అడ్డురావడం యిష్టంలేక మౌనం వహించాడు. తోకచుక్క గురించిన వార్తలు, విశేషాలు, వ్యాసాలు పత్రికలలో వస్తున్నాయి.

** ** **

విద్యాసాగర్ తోకచుక్క పత్రికలలో ''విద్యాస్ కామెట్''గా, ''కామెట్ విద్యా''గా పేరు పొందింది. ఆ తోకచుక్క గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఆ సదస్సుకు విద్యాసాగర్ కూడా లండన్ వెళ్ళాడు. అక్కడందరూ ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలే. మొదటిరోజు ఆ తోకచుక్క గురించి ఉపన్యాసాలు జరిగాయి. రెండవరోజు మాత్రం రహస్య సమావేశం జరిగింది.

''విద్యాస్ కామెట్'' భూమిని ఢీకొట్టే ప్రమాదం వుంది. ఆ ప్రమాదం నుంచి మానవాళిని, భూగోళాన్ని కాపాడడం యెలా? అది భూ వాతావరణపు పై పొరల మీదుగా వెళ్ళిపోతే పర్వాలేదు. అలా కాక అది భూమికి పతనం అయితే ఎలాంటి వైపరీత్యాలు సంభవిస్తాయి? అసలు అది భూమిని తాకకుండా నిరోధించడం ఎలా?'' అనే అంశాలపై అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన శాస్త్రవేత్తలు తర్జన భర్జనలు జరిపారు.

ఆ ధూమకేతు క్షోభ నుంచి భూగోళాన్ని రక్షించగల ప్రక్రియలు గురించి పరిశీలన జరిపారు. అనేకులు అనేక ప్రతిపాదనలు చేశారు. చివరకు అందరూ ఒక ప్రయోగాన్ని ఆమోదించారు.

తోకచుక్క భూమికి 'X' దూరంలో వున్నప్పుడు దాని కక్ష్యని మార్చే అద్భుత ప్రయోగం అది. ఇందుకై ఒక నిర్ణీత కార్యక్రమంలో 'అణు రాకెట్'ని ప్రయోగించాలని నిర్ణయించారు. అయితే ఆ ప్రయోగ విజయం అనుమానాస్పదం. అందుచేత కొందరు శాస్త్రవేత్తలకు, కొన్ని ప్రభుత్వాలకు తప్ప మరెవరికీ ఆ ప్రయోగం గురించి తెలియరాదని, అంతవరకు ఆ సంగతిని రహస్యంగానే వుంచాలని, అందరూ ఒప్పుకొన్నారు. ఆ ప్రయోగానికై ఒక 'టైమ్ టేబుల్'ని రూపొందించారు.

డిసెంబరు 24న ఆ తోకచుక్క కక్ష్యని మార్చే ప్రయత్నం చేయడం. అది విఫలమైతే తోకచుక్క జనవరి 14న భూమిని ఢీకొడుతుంది. తోకచుక్క ప్రమాణాన్ని బట్టి అణురాకెట్ శక్తి ఆధారపడి వుంటుంది. తోకచుక్క పెద్దసైజులో వుండకూడదని అందరూ ఆశించారు.

ఆ సమావేశం తర్వాత విద్యాసాగర్ యూరప్ దేశాలు పర్యటించాడు. అన్నిచోట్ల సన్మానాలు, ప్రముఖులతో పరిచయాలు, ఉపన్యాసాలు. ఆ పర్యటన అంతా అతనికి ఎంతో విజ్ఞానాన్ని ఇచ్చింది.

** ** **

యూరప్ పర్యటన ముగించుకొని యింటికి చేరేసరికి అతని ఆశ్చర్యానికి అంతే లేదు. ఇంటినిండా మంత్రోచ్చాటనలు, హోమాలు, వచ్చేపోయే భక్తుల కలకలం, వసంత దీక్షగా ఆ పూజలు చేయిస్తోంది.

''ఏమిటిదంతా?'' విద్యాసాగర్ భార్యని అడిగాడు ఆసక్తిగా, విసుగుగా.

''మీరు తోకచుక్కని కనుగొన్నారు. రోజూ దానిని చూస్తారు. దానివల్ల ఎంతో కీడు కలుగుతుందట. ఆ కీడునుంచి మిమ్మల్ని రక్షించడానికి ఈ శాంతిహోమం చేయించాను. ఇవాళ ఆఖరు రోజు. మీకు పురోహితులు ఆశీర్వచనం...'' వసంత భర్త కళ్ళల్లోకి ఆశాపూరితమైన చూపులతో చూస్తూ అంది. ఆమెలో స్త్రీకి సహజమైన ముత్తైదువదనం కానవస్తోంది.


అర్థంలేని భయాలు ఆమెని విపరీతంగా కలవరపరిచాయని విద్యాసాగర్ గ్రహించాడు. ఆమె తృప్తికోసం పురోహితుల ఆశీర్వచనం తీసుకొన్నాడు. అందరూ వెళ్ళిపోయారు.

** ** **

## పురిటి సంధి

మధ్య తరగతి
మందభాగ్యుని కోర్కెలు
నవ నవోన్మేష
నును లేత మొగ్గలు...
పుష్పించడానికై
ఫలించడానికై
పల్లవిస్తున్నాయి...
పరవశిస్తున్నాయి...
పాపం!
వాటికి తెలియదు...
''పురిట్లోనో
సంధి కొట్టిందని!!

—సూర్యప్రసాదరావు



రాత్రి ఇద్దరూ మేడమీదకు వెళ్ళారు. విద్యాసాగర్ తన పర్యటన వివరాలు చెప్పాడు. అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆత్రంగా టెలిస్కోపు దగ్గరకు నడిచాడు. ఆకాశం అంచులవైపు చూశాడు.

"మృత్యు సందేశాన్ని" తీసుకువస్తున్నట్లుతోకచుక్క మెరుస్తోంది. తోకచుక్కల గురించి ప్రాథమిక పరిజ్ఞానం లేని ఆదిమ మానవుడు, మధ్య యుగపు మానవుడు రకరకాల భయాల్ని కల్పించుకొన్నాడు. కాని వాటి నిర్మాణం, గమనం గురించి తెలిసిన తర్వాత కూడా యీ భయాలు తొలగిపోలేదు. తోకచుక్క భూమిని ఢీ కొంటే జరిగే పరిణామాలు గురించిన భయం అది.

అజ్ఞానంలోంచి వచ్చిన భయం మూఢ నమ్మకం అవుతుంది.

విజ్ఞానంలోంచి జన్మించిన భయం జాగ్రత్తని నేర్పు తోంది. రెండూ భయాలే. కారణాలు వేరు. నివారణో పాయాలు వేరు.

విద్యాసాగర్ మనస్సులో భయం-జాగ్రత్త గురించిన ఆలోచనే సాగుతోంది.

అతని మనసులో డిసెంబరు 24న తేదీ గిరగిర తిరుగుతోంది. నెమ్మదిగా వచ్చి భార్య ప్రక్కన కూర్చు న్నాడు. అతనిలో విషాద గాంభీర్యాన్ని ఆమె గుర్తించలేక పోయింది.

"ఇంత శాస్త్రవేత్త భార్యనై వుండి, చదువుకొన్న దానినైన నేను యీ శాంతి యజ్ఞం చేయించడం ఏమిటని లోకం మిమ్మల్ని ఎత్తిపొడుస్తుందని బాధపడుతున్నారా? నాకు మీ క్షేమం ముఖ్యం. అంతే!" ఐదు పదులు నిండిన వసంత కంఠంలో జీరని విద్యాసాగర్ గుర్తించక పోలేదు. ఆమె తలని ఆదరపూర్వకంగా నిమిరాడు. అనునయ పూర్వకంగా చూశాడు.

"వసంతా! శాస్త్రం కన్నా విశ్వాసం ఎంత బల మైందో!" అన్నాడు భావ గర్భితంగా విద్యాసాగర్.

"మనది తరతరాల శాస్త్రం. యుగయుగాల విశ్వాసం" అంది వసంత. విద్యాసాగర్ భావం ఆమెకు అర్థం కాలేదు.

తోచుక్క గమన కక్ష్యని మార్చగల సాంకేతిక పరిజ్ఞానం, రోదసీ యంత్ర సామర్థ్యం మనిషికి యీనాడు అందుబాటులో వున్నా కూడా ఆ ప్రయోగ విజయంపై యింకా విశ్వాసం కుదరడం లేదు. అందుకే "ప్రయోగ శాస్త్రం కన్న విశ్వాస బలం మిన్న" అని విద్యాసాగర్ ఆలోచిస్తున్నాడు. వసంతకివన్నీ అర్థం కావు. ఆమె మామూలు గృహిణి.

** ** **

ఏం ఆలోచిస్తున్నా, ఏం చేస్తున్నా విద్యాసాగర్ మనసంతా డిసెంబరు 24న తేదీపైనే వుంది.

"ప్రాజెక్ట్ లైట్ బ్రిగేడ్" ప్రయోగం ఫలప్రదం అయితే అదే చాలు" అదే అతని ఆలోచనా, ఆశంస.

తోకచుక్క కక్ష్యని మార్చే యీ ప్రయోగానికి "ప్రాజెక్ట్ లైట్ బ్రిగేడ్" అని పేరు పెట్టారు. అనుకొన్న సమయానికి అణుచోదిత రాకెట్‌ని ప్రయో గించారు. అది మహా వేగంతో పయనించి నిర్ణీత కార్యక్రమం ప్రకారం తోకచుక్కని ఢీకొట్టి అణుశక్తిని వెదజల్లి తోకచుక్క కక్ష్యని మార్చి ప్రేలిపోయింది. ఈ సంగతి కొందరికి తప్ప అందరికీ తెలీదు.

అయితే లండన్ కార్యాలయం నుంచి సాధికారికమైన వర్తమానం అందేవరకు విద్యాసాగర్‌లో భయం పోలేదు. పరధ్యానంగా, వివ్వల చిత్తంతో తిరుగుతుండే వాడు. అతనిలోని యీ మార్పు గుర్తించి వసంత ఒకనాడు నవ్వుతూ యిలా అంది.

"శాంతి యజ్ఞం చేయించాం. దేశంలో చాలా చోట్ల యిలాంటి హోమాలు చేయించినట్లుపత్రికలలో వార్తలు వచ్చాయి. ఇంకా భయం దేనికి? ఆ తోకచుక్క ఎలా వచ్చిందో అలాగే పోతుంది లెండి."

వసంత మంత్రాల గురించి వ్యక్తం చేసిన విశ్వాసం విద్యాసాగర్‌కి అచ్చెరువనిపించింది. మందహాసం చేసి వూరుకొన్నాడు.

** ** **

ఆ రోజు రానే వచ్చింది. లండన్ కార్యాలయం నుంచి అధికారి ఒకరు విద్యాసాగర్‌కివర్తమానంపంపాడు.

"ప్రాజెక్ట్ లైట్ బ్రిగేడ్" విజయవంతం అయింది. నేను ఆలస్యంగానే అయినా 'క్రిస్మస్ కేక్'ను కొను క్కొన్నాను. "నిడ్యాస్ కామెట్" గమన కక్ష్య మార్పుని మీరు గుర్తించగలరు."

ఇదీ ఆ వర్తమానం సారాంశం. విద్యాసాగర్ ఆనందా నికి అవధులు లేవు. విజ్ఞాన శాస్త్ర వరప్రసాదం వల్ల తోకచుక్క ప్రమాదం తప్పిపోయింది. ఆ రోజు అతను తెలిసిన వాళ్ళందరికీ స్వీట్లు పంచిపెట్టాడు. ఆ రోజే ఊరినుంచి వచ్చిన మనవడికి కొత్త బట్టలుకొనిపెట్టాడు. భర్తలోని వింత సంబరాన్ని కనిపెట్టిన వసంత సంగతి తెలీక ఆరా తీసింది.

"పిచ్చిదానా! తోకచుక్క తోకముడిచి వెళ్ళి పోయింది" అన్నాడు విద్యాసాగర్ ఆనందంగా.

"మేం చేయించిన శాంతి హోమం వెదజల్లిన నేతి పొగ దాని తోకని మింగేసింది. పాపం ఏం చేస్తుంది" అదంతా తమ మంత్రాల ప్రభావం అని వసంత ధీమాగా చెప్పింది. విద్యాసాగర్ అవాక్ అయాడు. అతని మనోఫలకంపై శాంతి హోమం దృశ్యం కదలా డింది. అశేష జనులు ఉచ్చైస్వరంతో శాంతి మంత్రం పఠించడం వినిపించింది.

అంతలోనే ఆ దృశ్యం మాయమైంది. ఆ శబ్దం లుప్తమైంది.


ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలు కంప్యూటర్ల ముందు కూర్చుని తోకచుక్క కక్ష్యని మార్చే ప్రయత్నాన్నివిజయ వంతంగా కొనసాగించిన దృశ్యం కూడా అతని మనో పటలం పై కనిపించింది.

ఏది శాస్త్రీయం? ఏది అశాస్త్రీయం?

ఏది విజ్ఞానం? ఏది అజ్ఞానం?

సమాజంలో పేదరికానికీ, ఐశ్వర్యానికీ ఉన్నంత వ్యత్యాసం ఇది. శాస్త్ర వాదానికీ, విశ్వాస వేదానికీ వున్న తేడాని కాలమే, శాస్త్ర పరిశోధనలే తగ్గించాలి.

విద్యాసాగర్ కళ్ళలో ఆ ఆశే కనిపిస్తోంది.






## కాలమ్ దాటని కథ

# "నమస్కారం!"

ఖాజీపేటలో మా చెల్లెల్ని అత్తాగారింట దిగబెట్టి తిరుగు ప్రయాణ మయ్యాను. ఉదయం తొమ్మిది గంటలకు ఖాజీపేటలో కృష్ణాఎక్స్‌ప్రెస్ ఎక్కాను. నాకు రైలు ప్రయాణం కొత్త. చాలా రద్దీగా వుంది ట్రయిన్. సీట్లన్నీ నిండిపోయాయి. చేసేది లేక చేతిలోని బ్రీఫ్ కేసును లగేజీ ర్యాక్ మీద నేసి ద్వారం వద్ద నిల్చున్నాను. నాతోపాటు మరో అయిదారు మంది కుర్రాళ్ళు అక్కడ నిల్చుని వున్నారు. వాళ్ళు సినిమా హీరో హీరోయిన్ల గురించి చాలా తీవ్రంగా చర్చించు కుంటున్నారు. వాళ్ళ మాటలను బట్టి వీళ్ళు కాలేజీ చదువులు పూర్తి చేసి తల్లిదండ్రుల సంపాదనపై జల్సాచేస్తున్నారని అర్థమైంది. నేను వాళ్ళనే పరికించి చూస్తూ గేటు వద్ద నిల్చున్నాను. ట్రయిన్ సెకెండ స్టేషన్ చేరినప్పుడు, నల్లటి కోటు వేసుకొని చేతిలో రశీదు పుస్తకంతో ప్రత్యక్షమయ్యాడు టి.సి. ఆయన్ను చూస్తుండగానే ఆ కుర్రాళ్ళంతా పక్కకు జరిగి, వినయంగా



"నమస్కారంసార్!" అన్నారు ముక్త కంఠంతో. ఆయన వాళ్ళందరి నమస్కారం చిరునవ్వుతో స్వీకరించాడు. ఆయన రైలులో పెద్ద అధికారి కామోసు అనుకొని, నేను మౌనంగా కుడి చెయ్యి పైకెత్తి శల్యూట్ చేశాను. అతను నాకేసి ఒకసారి ఉరిమి చూచాడు. నేనాశ్చర్య పోయాను. ఏం పొరపాటు చేశానో నాకర్థం కాలేదు. అతను నావద్దకు జరిగి, "వాళ్ళు సరే మా రెగ్యులర్ కస్టమర్లు. నీ వెవడివో కొత్తవాడివి. టికెట్టు లేకుండా ప్రయాణం చేస్తావా? పెనాల్టీకట్టు" అంటూ రశీదు పుస్తకం సర్దుకున్నాడు. అతనేమంటున్నాడో నాకర్థం కాలేదు. జేబులో నుండి టికెట్టు తీసి ఆయనకు చూపించాను. టికెట్టు పరీశీలించి, నాచేతి కందించేస్తూ, "మరి నాకు శాల్యూట్ ఎందుకు చేశావు?" అని అడిగాడు కోపంగా.

నేనేం చెప్పాలో తెలియ లేదు. నేనేం చెప్పలేనని ఆయనకు గూడా తెల్సినట్లుంది. అక్కడ నుంచి త్వర త్వరగా కదిలి పోయాడు. అప్పుడర్థమైందినాకు. "ట్రయిన్‌లో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసే వాళ్ళే టి.సి.లకు నమస్కారం పెట్టాలి/పెడ్తారు అని".

—వైదేహి